క్లుప్తంగా

రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉండాలి

గుడివాడరూరల్: రౌడీషీటర్లు తమ తీరు మార్చుకుని నేరాలకు దూరంగా క్రమ శిక్షణతో జీవించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానిత వ్యక్తులపై పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందన్నారు.

వెంకన్న సన్నిధిలో పుత్ర కామేష్టి యాగం



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం వైభవోపేతంగా పుత్ర కామేష్టి యాగ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు. ఈ యాగాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారని పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం




తోట్లవల్లూరు: పేద విద్యార్థుల చదువుకు బీవీఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత బొమ్మారెడ్డి వెంకటరెడ్డి బాసటగా నిలిచారు. మండలంలోని గరికపర్రుకు చెందిన గోళ్ల శివ ఇంజినీరింగ్ చదువు ఫీజు నిమిత్తం రూ. 50 వేలు, కుమ్మమూరు గ్రామానికి చెందిన మండపాక కీర్తి డిగ్రీ చివరి ఏడాది ఫీజు రూ. 25 వేలను బీవీఆర్ ట్రస్టు తరఫున బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్ ఆదివారం అందజేశారు. కీర్తి డిగ్రీ చదువుకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫీజును కూడా బీవీఆర్ ట్రస్టు ద్వారా అందజేసినట్లు శ్యామ్ తెలిపారు. తమ బిడ్డల చదువుకు అండగా నిలిచిన బీవీఆర్ ట్రస్టు అధినేత బొమ్మారెడ్డి వెంకటరెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. బీవీఆర్ యూత్ కార్యదర్శి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ తల్లి పావన ప్రతిష్ఠాపన



తోట్లవల్లూరు: మరీదు వారి మైసమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి పావనాల ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. భక్తుల సహకారంతో నూతనంగా పునర్నిర్మించిన ఆలయంలో మైసమ్మతల్లి, కోట మైసమ్మ తల్లి పావనాల ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

అన్నసమారాధన



గుడివాడ టౌన్: స్థానిక కైకాలవారి వీధిలోని శ్రీ కోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్న సమారాధన జరిగింది. శ్రీరామనవమి పర్వదినం ఘనంగా నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని శాంతి నిమిత్తం ఈ అన్నసమారాధన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు పెరుమాళ్ల శ్రీధర్, పెరుమాళ్ల కుమార్, శీలం సుబ్రహ్మణ్యేశ్వరరావు, నేరెళ్ల సుబ్రహ్మణ్యం, తాడికొండ శివ, మెకానిక్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణించేది ఎలా?



అధ్వానంగా మారిన తమిరిశ-నందివాడ రోడ్డు

- తూతూ మంత్రంగా రోడ్ల మరమ్మతులు
- హామీలను విస్మరించిన కూటమి నాయకులు



గుంతలమయంగా మారిన గొంగళ్లమూడి-పెదవిరివాడ రోడ్డు

గుడివాడరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్లను అభివద్ధి చేస్తామని నాయకులు ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మిగిలాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా రోడ్ల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడ మాదిరిగానే ఉంది. ఏ రోడ్డు చూసినా గుంతలతోపాటు రాళ్లు లేచి దర్శనమిస్తున్నాయి. ఎన్నికల సమయంలో హామీల పేరిట నానా హంగామా చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించారనే విమర్శలున్నాయి.

రోడ్డు అంతా గుంతలే

తమిరిశ నుంచి పోలుకొండ వెళ్లే రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. అడుగేస్తే గొయ్యి, అడుగు తీస్తే లేచిన రాళ్ల మాదిరిగా ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. ఎక్కడ చూసినా పెద్ద గుంతలతో రోడ్డు దారుణంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు తంటాలు పడుతున్నారు. ఈ రోడ్డు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుకు కొన్నిచోట్ల తాత్కాలిక మరమ్మతులు తూతూమంత్రంగా చేయడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

నరకప్రాయంగా ప్రయాణం

మండల కేంద్రానికి వెళ్లే తమిరిశ-నందివాడ రహదారి పరిస్థితి కూడా దారుణంగా ఉంది. ఈ రోడ్డు ఏడు కిలో మీటర్ల మేర ఎక్కడ చూసినా భారీ గుంతలే దర్శనమిస్తున్నాయి. రాళ్లు లేచి ప్రయాణాలకు రోడ్డు నరకప్రాయంగా మారింది. గొంగళ్లమూడి నుంచి పెదవిరివాడ వెళ్లే రోడ్డు పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. కనీసం మరమ్మతులు అయినా చేపట్టాలని కోరినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. సంక్షేమ పథకాలు కూడా ఇవ్వని ప్రభుత్వం రోడ్లను అయినా అభివృద్ధి చేస్తుందని ఆశపడితే అదీ చేయకుండా ప్రజలను మోసం చేస్తోందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి రోడ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ధూళిపూడిపాలెం రహదారిని బాగుచేయరా?



రాళ్లు తేలిన మేడూరు-ధూళిపూడిపాలెం రోడ్డు

పమిడిముక్కల: ఏళ్లు గడుస్తున్నా మేడూరు శివారు ముత్రాసిపాలెం, ధూళిపూడిపాలెం గ్రామాలకు వెళ్లు రహదారికి మాత్రం మోక్షం కలగడం లేదు. ఈ రహదారంతా గుంతలు పడి, రాళ్లు లేచి ప్రమాదకరంగా ఉంది. రెండు గ్రామాల ప్రజలు ప్రతి పనికి మేడూరు, పమిడిముక్కల వెళ్లాల్సి ఉంది. రహదారిపై రాకపోకలు సాగక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి దుస్థితిని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లానా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ముత్రాసిపాలెం, ధూళిపూడిపాలెం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాలకులు, అధికారులు స్పందించాలి



పోలుకొండ-తమిరిశ రోడ్డు దారుణంగా మారింది. అడుగు వేస్తే గొయ్యి అడుగుతీస్తే రాళ్లు మాదిరిగా ఉంది. రోడ్డుపై ప్రయాణానికి తంటాలు పడుతున్నాం. రాత్రయితే రోడ్డుమీద ప్రయాణించే పరిస్థితి లేదు. రోడ్డు దెబ్బకు ఆటోవాళ్లు సైతం గ్రామాలకు రావడం లేదు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పాలకులు, అధికారులు స్పందించాలి.

– వంశీ, పోలుకొండ గ్రామం

ప్రమాదాలబారిన పడుతున్నాం



గొంగళ్లమూడి నుంచి పెదవిరివాడ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై భారీస్థాయిలో గుంతలు ఏర్పడ్డాయి. భారీ వాహనాలు రోడ్డుపై వెళుతుండటంతో రోడ్డు పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ రోడ్డుపై ప్రయాణించేవారిలో పలువురు ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డుకు వెంటనే బాగుచేయండి.

– కలంకూరి వెంకటరత్నం, గ్రామస్తుడు

కొడాలి నాని కోలుకోవాలని నాయకుల పాదయాత్ర



కొడాలి నాని కోలుకోవాలని ప్లకార్డులతో అభిమానులు, నాయకులు

గుడ్లవల్లేరు: మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ నాయకుడు కొడాలి శివ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కూచికాయలపూడి నుంచి వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయం వరకు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. బైపాస్ సర్జరీ చేయించుకున్న మాజీ మంత్రి కొడాలి నాని సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని కాంక్షిస్తూ వేమవరం శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ అభిమానులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పద్మాలపాలెంలో కొడాలి నాని కోలుకోవాలని బైండ్ల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు నిడుమోలు పెద్దిరాజు క్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొడాలి నాని ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ పలువురు అభిమానులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంత రావు, ఎంపీపీ కొడాలి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు బలుసు జితేంద్ర, పెన్నేరు ప్రభాకర్, కొంకితల ఆంజనేయ ప్రసాద్, బాజీ, సతీష్‌రెడ్డి, తోట ప్రసన్నాంజనేయులు, పిన్నమనేని రాఘవేంద్రరావు, నవీన్‌కుమార్, జితేంద్ర, వెంకటేశ్వరరావు, నాగు, నాగరాజు, జుజ్జవరపు మల్ల, నాని, వినయ్, మహేష్, వెంకటరెడ్డి, కొడాలి వెంకటేశ్వరరావు, రవీంద్ర, శివ, గోగులమూడి శ్రీనివాసరావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద అభిమానుల నివాళి

నేడు అయ్యప్ప ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం



హోమం చేస్తున్న గంగాధరరావు దంపతులు



ముస్తాబైన అయ్యప్ప ఆలయం

గుడ్లవల్లేరు: మండలంలోని పెసరమిల్లిలో నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంతో పాటు ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు మామిడికోళ్ల సర్పంచ్ వడ్రే విజయలక్ష్మి తెలిపారు. ఈ ప్రతిష్ఠోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విశేష హోమాలతో పాటు జలాదివాసం, ధాన్యాదివాస కార్యక్రమాలను వేద పండితులు చేపట్టారు. ఈ ఉత్సవాన్ని శ్రీ వాసుదేవానంద భారతీ మహాస్వామి నిర్వహించనున్నట్లు వడ్రే గంగాధరరావు, బలరామకృష్ణ తెలిపారు.

ఒత్తిడి లేని విద్యను విద్యార్థులకు అందించాలి

కూచిపూడి(మొవ్వ): విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించాలని పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(రామచంద్రపురం) ఎం.వెంకటనారాయణ పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన కూచిపూడి వేదిక్ శ్రీ మేధా వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఏదో ఒక కళలో ఆసక్తి ఉంటుందన్నారు. అది సంగీతం కావచ్చు, నాట్యం కావచ్చు, చిత్రలేఖనం కావచ్చు అని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు, విద్యాసంస్థల అధినేత డాక్టర్ వేమూరి పరిశుద్ధరాజు మాట్లాడుతూ పిల్లలతో తల్లిదండ్రులు కొంత సమయాన్ని కేటాయించి వారి ఇష్టాలను తెలుసుకోవాలన్నారు. వారి విద్యాబుద్ధుల పై ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకుంటూ ఉండాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ కార్యక్రమానికి భావ తరంగిణి సంపాదకులు (మచిలీపట్నం) భవిష్య అధ్యక్షత వహించారు. అనంతరం విద్యార్థుల నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి ఎస్ఐ కేఎస్ విశ్వనాథ్, ఆ పాఠశాల చైర్మన్, సీనియర్ న్యాయవాది ఏలేశ్వరపు శివ సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ ఏలేశ్వరపు రాధికా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ వెంపటి బాపి రాజు, నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ రాధిక సుబ్రమణ్యం

సుబ్బారావుకు డీఎన్నార్ ఘన నివాళి

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రాచూరి కుమార్ తండ్రి సుబ్బారావుకు ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆదివారం నివాళులర్పించారు. సుబ్బారావు ఇటీవలే మృతి చెందగా సంస్కరణ సభ గురజలో ఆదివారం నిర్వహించారు. ముదినేపల్లి, మండవల్లి ఎంపీపీలు రామిశెట్టి సత్యనారాయణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, నాయకులు కోమటి విష్ణువర్ధన్, సయ్యపురాజు గుర్రాజు, కె.కనక దుర్గారాణి, మోత్రు ఏసుబాబు, ఈడే వెంకటేశ్వర రావు, ఉల్లంకి నగేష్, శీలం రామకృష్ణ, మర్రివాడ సుధాకరరెడ్డి, షేక్ అల్లాభక్షు, దివి సతీష్, కొల్లి నాని పాల్గొన్నారు.



సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎన్నార్

ఘనంగా మట్టల ఆదివారం



గురివిందపల్లిలో ఈతమట్టలతో ప్రదర్శన నిర్వహిస్తున్న చిన్నారులు



పామర్రు మండలం పెదమద్దాలిలో మట్టల ఆదివారం



గుడివాడలో మట్టలతో క్రైస్తవుల ప్రదర్శన



మండవల్లిలో మట్టల ఆదివారం



మేడూరులో మట్టల ఆదివారం ర్యాలీ

తోట్లవల్లూరు: మండలంలోని గురివిందపల్లిలో మట్టల ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక గ్రేస్ చర్చి పాస్టర్ వీజేవీ ఆల్డ్రిన్ ఆధ్వర్యంలో చిన్నారులు మట్టల ఆదివారం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పూలతో అందంగా అలంకరించిన ఈతమట్టలను చిన్నారులు చేతబట్టి గ్రామంలోని వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. పాస్టర్ ఆల్డ్రిన్ క్రీస్తు గీతాలను ఆలపించారు.

పెదమద్దాలిలో..

పామర్రు: మండలంలోని పెదమద్దాలి గ్రామ పురవీధుల్లో ఆదివారం ఈత మట్టలతో గ్రామోత్సవం నిర్వహించారు. పెదమద్దాలి సెయింట్ పాల్ చర్చి సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సెయింట్ పాల్ చర్చి పాస్టర్ సమ్మంగి కృష్ణపాల్, సంఘ పెద్దలు సమ్మంగి సత్యరూతు, కాకే ప్రసా, గుమ్మడి నవ్య, రోమతోటి గ్రేసమ్మ పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: మట్టలాదివారపు ఆరాధనలు ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గుడ్‌ఫ్రైడేకు ముందు ఆదివారం మట్టలాదివారంగా ఆచరించడం అలనాడు యెరూషలేంలో ఏసుక్రీస్తుకు జరిగిన ఆహ్వాన సాంప్రదాయాలను గుర్తుచేసుకుంటూ క్రైస్తవులు పూలతో అలంకరించిన ఈత, కొబ్బరి మట్టలు పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలోని చర్చిల వద్ద ఆదివారం మట్టల ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ఆర్సీఎం చర్చి వద్ద రెవరెండ్ ఫాదర్ శాంత్‌రాజు ఆధ్వర్యంలో మట్టల ఆదివారం నిర్వహించారు.

మేడూరులో..

పమిడిముక్కల: మేడూరులో సీబీసీఎన్‌సీ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం మట్టల ఆదివారం నిర్వహించారు. చిన్నారులు ఈతమట్టలు చేతబూని క్రీస్తు గీతాలు ఆలపిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో మట్టల ఆదివారం పండుగ ఘనంగా జరిగింది. ఎల్ఈఎఫ్ చిన్నారులు, ఆర్సీఎం చర్చి సంఘ విశ్వాసులు ముదినేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఆర్సీఎం చర్చి ఫాదర్ కమతం మరియదాసు, ఎల్ఈఎఫ్ చర్చి ఫాదర్ ఇశ్రాయేలు, కొరగుంటపాలెం చర్చి ఫాదర్ ఉచ్చుల స్పర్జన్‌రాజు, ఉచ్చుల విజయకుమార్ ప్రత్యేక సందేశాలు ఇచ్చారు.

పెదపూడిలో..

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జాకబ్ ప్రసాద్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చి ప్రాంగణం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన మట్టలను చేత పట్టుకుని ఆ ప్రభుని స్తుతిస్తూ ప్రదర్శన చేశారు.

కైకలూరులో..

కైకలూరు: క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఈత రెబ్బలతో ఊరేగింపులు చేశారు.

ఉపాధ్యాయినికి అంబేడ్కర్ ప్రతిభా పురస్కారం



గుడివాడ టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గుడివాడ విద్యాలయ పాఠశాల ఉపాధ్యాయిని మేరుగు వెంకట రమణకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారాన్ని ఆదివారం అందజేశారు. స్టేట్ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరు ఏసీ కళాశాల్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా ఈ అవార్డు పురస్కారం జరిగింది.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

పామర్రు: బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం ఉదయం 8 గంటలకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కార్యాలయ సిబ్బంది ఆదివారం తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం తాడేపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగే జయంతి వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

ముదినేపల్లిలో రక్తదాన శిబిరం

ముదినేపల్లి రూరల్ : అంబేడ్కర్ జయంతి సందర్భంగా ముదినేపల్లిలో ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. స్థానిక జై భీమ్ యువసేన నాయకుడు మదిరి పార్థసారథి ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటుచేయగా రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ కొడాలి వినోద్ శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు, బుంగా జోజి, పాగోలు విజయసాగర్, గద్దె రాజు, దావీదు పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటరులోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సదూర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు పోటెత్తడంతో ఆలయ సహాయ కమిషనర్ ఆర్ గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.

అంబేడ్కర్ జయంతిని ప్రశాంతంగా నిర్వహించండి



ముదినేపల్లిలో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ



గుడివాడలో అంబేడ్కర్ కమిటీ సభ్యులు, యువతతో మాట్లాడతున్న ఎస్ఐ చంటిబాబు

గుడివాడరూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అంబేడ్కర్ కమిటీ సభ్యులు, యువతతో జయంతి వేడుకల నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ జయంతి వేడుకల్లో ఎటువంటి గొడవలు, ఘర్షణలు జరగకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, వలివర్తిపాడు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు కండవల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను మండలంలో సోమవారం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కైకలూరు రూరల్ సీఐ కె.రవి కుమార్, ఎస్సై వీరభద్రరావు కోరారు. మండలంలోని అంబేడ్కర్ విగ్రహాల కమిటీ సభ్యులు జయంతి ఉత్సవాల నిర్వహకులతో స్థానిక పోలీసు స్టేషన్లో ఆదివారం సమావేశం నిర్వహించారు.

కైకలూరులో..

కైకలూరు: బీఆర్ అంబేడ్కర్ జయంతిని శాంతియుతంగా నిర్వహించుకోవాలని కై కలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో అంబేడ్కర్ యువజన నాయకులతో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పట్ల నిబద్ధతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ సర్కిల్ ఎస్ఐలు రాంబాబు, వెంకటేశ్వర రావు, రామచంద్రరావు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.